

రేపు వ్యవసాయ విశ్వ విద్యాలయ స్నాతకోత్సవం

రాయచూరు, ఫిబ్రవరి 27 : రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం 13వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ హనుమంతప్ప తెలిపారు. విశ్వ విద్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామితో పాటు పలువురు వ్యవసాయ శాస్త్ర ప్రముఖులు, శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. 363 మందికి డిగ్రీ, 127 మందికి పీజీ, 26 మంది విద్యార్థులకు డాక్టరేట్లు అందజేయనున్నట్లు ఉపకులపతి తెలిపారు.



అజయ్ మాకెన్



చంద్రశేఖర్













ఓటు వేస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, విజయేంద్ర, ప్రతిపక్షనేత ఆర్ అశోక్, మాజీ సీఎం కుమారస్వామి, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్‌టీ సోమశేఖర్



నారాయణసా భాండగె



నాసిర్ హుసేన్

బెడిసికొట్టిన బీజేపీ-జేడీఎస్ వ్యూహం



రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైనవారితో డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో ఆత్మసాక్షి నినాదం అధికార కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. మిగులు ఓట్లతో రెండో స్థానాన్ని చేజిక్కించుకోవాలన్న బీజేపీ-జేడీఎస్ వ్యూహం బెడిసికొట్టింది. నాలుగు స్థానాలకు గాను మూడింటిని కాంగ్రెస్ కైవసం చేసుకోగా బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. జేడీఎస్ అభ్యర్థి పరాజయం పాలయ్యారు. విధాన సౌధలో మంగళవారం ఉదయం 9 గంటలకే ఓటింగ్ ప్రారంభమైంది. బీజేపీ ఎమ్మెల్యే సురేశ్‌కుమార్ తొలి ఓటు వేశారు. మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ్ బొమ్మై, హెచ్‌డీ కుమారస్వామి కలసికట్టుగా వచ్చి మరీ ఓటు వేశారు. మొత్తం 224 స్థానాలకుగాను కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక మృతితో 223 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉండగా బీజేపీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. బెంగళూరు యశ్వంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ పార్టీ విప్‌ను పట్టించుకోకుండా కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ మాకెన్‌కు ఓటు వేశారు. రిటర్నింగ్ అధికారిగా ఉన్న శాసనసభ కార్యదర్శి విశాలాక్షి ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థులు అజయ్ మాకెన్, సయ్యద్ నాసిర్ హుసేన్, జీసీ చంద్రశేఖర్, బీజేపీ అభ్యర్థి నారాయణసా భాండగె తొలి రౌండ్‌లోనే గెలుపొందారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన అజయ్ మాకెన్, నాసిర్ హుసేన్, బీజేపీ అభ్యర్థి నారాయణసా భాండగెలకు తలా 47 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌కు 45 ఓట్లు రాగా జేడీఎస్-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కుపేంద్రరెడ్డికి 36 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో నెలకొన్న అసంతృప్తి ద్వారా లబ్ధి పొందుదామని భావించిన బీజేపీ-జేడీఎస్ కూటమికి ఈ ఫలితాలు గట్టి షాక్ ఇచ్చాయనే చెప్పాలి.

- రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ జయభేరి
- మూడు స్థానాల్లో విజయకేతనం
- బీజేపీకి ఒక స్థానం
- కలిసొచ్చిన ఆత్మసాక్షి నినాదం
- క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఎస్‌టీ సోమశేఖర్‌పై ఆగ్రహ జ్వాలలు
- కాంగ్రెస్‌లో ఐక్యతకు అద్దం పట్టిన ఫలితాలు : సీఎం

ఫలించిన సిద్దరామయ్య వ్యూహం

కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఐక్యతను కాపాడి చేజారిపోకుండా చూడడంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇద్దరు స్వతంత్రుల సహకారంతో బీజేపీ రెబెల్ ఎమ్మెల్యేల తోడ్పాటుతో ప్రతిపక్షాల వ్యూహాన్ని చిత్తు చేశారనే చెప్పాలి. ఓటు వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీకి ఆత్మే లేదని ఇక ఆత్మసాక్షి ఎక్కడిదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఐక్యతకు ఈ ఫలితాలు అద్దం పడుతున్నాయన్నారు. ప్రతిపక్షాల కుట్రలన్నింటినీ చిత్తు చేసిన పార్టీ ఎమ్మెల్యేలను అభినందించారు. విజేతలు ముగ్గురినీ సచివాలయంలోనే ఆయన ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఉపముఖ్యమంత్రిగా ఉన్న కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా ఈ సందర్భంగా విజేతలను అభినందించారు.

కర్ణాటక ప్రతినిధిగా పోరాడుతా: అజయ్ మాకెన్

ఢిల్లీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఈ విజయాన్ని అపూర్వమైనదిగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు పాటుపడతానని, రాజ్యసభలో తన వాణిని బలంగా వినిపిస్తానని చెప్పారు.

పార్టీకి రుణపడి ఉంటా: నారాయణసా భాండగె

ఒక సామాన్య కార్యకర్తగా ఉన్న తనను గుర్తించి రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేసిన అధిష్ఠానం పెద్దలకు, ఓటు వేసిన గెలిపించిన ఎమ్మెల్యేలకు సదా రుణపడి ఉంటానని బీజేపీ విజేత నారాయణసా భాండగె పేర్కొన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మల్లేశ్వరంలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. అక్కడ ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర స్వీట్లు తినిపించి అభినందించారు.



పోలింగ్ తర్వాత ప్రతిపక్ష ఎమ్మెల్యేల విజయసంకేతాలు



ఎస్‌టీ సోమశేఖర్‌కు వ్యతిరేకంగా బీజేపీ శ్రేణుల నిరసన

ఎమ్మెల్యేల ఐక్యతను చాటేందుకే పోటీ: కుమారస్వామి

రాజ్యసభ ఎన్నికల నెంబర్ గేమ్‌లో కాస్త వెనుకబడ్డామని జేడీఎస్ అగ్రనేత, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి అంగీకరించారు. ఫలితాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ ఎమ్మెల్యేల ఐక్యతను పరీక్షించేందుకే అభ్యర్థిని బరిలో నిలబెట్టామన్నారు. అధికార కాంగ్రెస్ ఎన్ని విధాలుగా ప్రలోభపెట్టినా మొత్తం 19 మంది ఎమ్మెల్యేలు ఏకతాటిపై నిలబడ్డారని ప్రశంసించారు.

కలకలం రేపిన పాక్ నినాదాలు

విధానసౌధ వద్ద రాజ్యసభ ఫలితాల అనంతరం విజయోత్సవ వేళ కాంగ్రెస్ విజేత నాసిర్‌హుసేన్ మద్దతుదారులు పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేయడం కలకలం రేపింది. దీన్ని గమనించిన నాసిర్ సదరు కార్యకర్తలను గదమాయించి తరిమేశారు. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు జరిగిన కుట్రలో ఇదొక భాగమన్నారు. ఈ ఘటనపై బీజేపీ ఘాటుగా స్పందించింది. నినాదాలు చేసిన కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఎస్‌టీ సోమశేఖర్‌పై వెల్లువెత్తిన ఆగ్రహం

బీజేపీ ఎమ్మెల్యేల్లో ఎస్‌టీ సోమశేఖర్ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడగా శివరాం హెబ్బార్ పోలింగ్‌లో పాల్గొనలేదు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు త్వరలోనే తమ శాసనసభ స్థానాలకు రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారన్న వదంతులు బలంగా వినిపిస్తున్నాయి. పార్టీ విప్‌ను ధిక్కరించి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డ ఎస్‌టీ సోమశేఖర్‌పై అనర్హత వేటు వేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్పీకర్‌కు బుధవారం ఫిర్యాదు చేయనుంది. మరోవైపు ఎస్‌టీ సోమశేఖర్ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డంతో బీజేపీ, జేడీఎస్ కార్యకర్తల్లో ఆగ్రహం వెల్లువెత్తింది. బీజేపీ ఆధ్వర్యంలో యశ్వంతపుర నియోజకవర్గంలో పలు చోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆయన దిష్టిబొమ్మలను చెప్పులతోకొట్టి తగలబెట్టారు. ఆయన ఫొటోలకు మసి పూశారు. జేడీఎస్ కార్యాలయంలోనూ ఇదే తరహాలో నిరసన కొనసాగింది. నిరసన చేస్తున్న కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి ఆపై విడుదల చేశారు.

ఇద్దరు డాక్టర్లు, నర్సులపై
సస్పెన్షన్ వేటు

- తుమకూరు డీహెచ్‌ఓ ఆదేశాలు
- పావగడ ఆసుపత్రిలో ముగ్గురు మహిళల మృతికి కారకులని ఆరోపణలు



ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న జయ కర్ణాటక రక్షణ వేదిక నాయకులు

పావగడ, ఫిబ్రవరి 27: ఈనెల 22న పావగడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడుగురు మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయగా ముగ్గురు మహిళలు మృతి చెందడానికి కారణమన్న ఆరోపణలపై డాక్టర్ పూజా, డాక్టర్ కిరణ్, హెడ్‌నర్సు పద్మావతిని సస్పెండ్ చేసినట్లు తుమకూరు డీహెచ్‌ఓ మంజునాథ్ వెల్లడించారు. వీరంతా ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు కింద ఉద్యోగాలు చేస్తున్నారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్న రాజవంతి గ్రామానికి చెందిన అనిత(28), రెండో సిజేరియన్ కోసం వచ్చిన వీర్లగొంది గ్రామానికి చెందిన అంజలి (24), బ్యాడనూరు గ్రామానికి చెందిన గర్భకోశం ఆపరేషన్ కోసం వచ్చిన నరసమ్మ(40)తోపాటు మరో నలుగురికి డాక్టర్ పూజా, హెడ్‌నర్సు పద్మావతి శస్త్ర చికిత్సలు చేశారు. వీరందరూ ఒకరి తరువాత ఒకరు మృతి చెందడంతో మృతుల బంధువులు సోమవారం ధర్నా నిర్వహించారు. మంగళవారం జయకర్ణాటక, కర్ణాటక రక్షణ వేదిక పలు స్వచ్ఛంద సేవా సంస్థల నాయకులు ప్రభుత్వ ఆస్పత్రి ముందు పెద్దఎత్తున ధర్నా చేపట్టడంతో ఆస్పత్రి చుట్టూ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపుచేశారు. ముగ్గురు మహిళల మృతికి కారకులైన డాక్టర్ పూజా, డాక్టర్ కిరణ్, హెడ్‌నర్సు పద్మావతిని సస్పెండ్ చేసినట్లు టీహెచ్‌ఓ తిరుపతయ్య తెలపడంతో పరిస్థితి సర్దుమణిగింది.

శస్త్ర చికిత్స చేసింది సీనియర్ నర్సులు

ఈనెల 22న పావగడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడుగురు మహిళలకు శస్త్ర చికిత్స చేసేందుకు గైనకాలజిస్ట్ డాక్టర్ పూజా బాధ్యతలు తీసుకొన్నారు. నలుగురు మహిళలకు డాక్టర్ పూజా శస్త్ర చికిత్సలు చేయగా చనిపోయిన ముగ్గురు మహిళలకు హెడ్‌నర్సు పద్మావతి, మరికొందరు అనుభవం లేని నర్సులు శస్త్ర చికిత్సలు చేశారు. శస్త్ర చికిత్స సమయంలో బీపీ, శ్వాసకోశ పరిస్థితిని చూసుకొని చేయాల్సి ఉంటుంది. అనుభవం, అవగాహన లేకుండా నర్సులు శస్త్ర చికిత్సలు చేయడం వల్ల మూడు రోజుల వ్యవధిలో ముగ్గురు మహిళలు మృతి చెందారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

కేంద్రం తీరుకు నిరసనగా
నేడు శాసనసభలో తీర్మానం?

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పన్నుల వాటా విడుదలలోనూ, గ్రాంట్ల కేటాయింపులోనూ, కరువుసాయంలోనూ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా శాసనసభలో బుధవారం ప్రత్యేక తీర్మానాన్ని అమోదించే సంకేతాలు కనిపిస్తున్నాయి. మంగళవారమే ఈ మేరకు ఒక తీర్మానాన్ని అమోదించి కేంద్రానికి పంపించాలని ప్రభుత్వం భావించింది. అయితే కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజావెంకటప్ప నాయక్ అకస్మిక మృతికి నివాళిగా సభను బుధవారానికి వాయిదా వేసిన సంగతి విదితమే. బడ్జెట్‌పై జరిగిన చర్చ కు శాసనసభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం సమాధానం ఇవ్వనున్నారు. అనంతరం ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయం పసిగట్టిన ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్ సభ నిరవధికంగా వాయిదా పడేంతవరకు సభలోనే ఉండాలని నిర్ణయించుకున్నాయి. కేంద్రం తీరును నిరసిస్తూ సభలో ఒకవేళ కాంగ్రెస్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించేందుకు ప్రయత్నిస్తే గట్టిగా ప్రతిఘటించి వాకౌట్ చేయాలని ప్రతిపక్షాలు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది.

జలమార్గాల అభివృద్ధికి ప్రాధాన్యం

- కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో జలమార్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అగ్రప్రాధాన్యతనిస్తోందని ఓడరేవులు, ఆయుష్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. నగర పర్యటకు వచ్చిన ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఈశాన్య భారత రాష్ట్రాల వికాసానికి దోహదపడేలా రూ.308 కోట్ల జలమార్గాల ప్రాజెక్టులకు ఇటీవల తాను శంకుస్థాపన చేశానని వెల్లడించారు. దిబ్రూగఢ్‌లోని బోగీబీల్, కరీంగంజ్‌లోని ఖాదర్‌పుర, దుబ్రిలోని ఐడబ్ల్యూఏఐ, త్రిపురలోని సోనామూరలో ఏకకాలంలో ఈ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టామని వివరించారు. అంతర్గత జలరవాణాకు ఇవి బాగా దోహపడతాయని, ఫలితంగా వాణిజ్య కార్యకలాపాలు పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని చెప్పారు. దుబ్రిలో కస్టమ్ ఇమ్మిగ్రేషన్ కార్యాలయాన్ని రూ.7.5 కోట్ల ఖర్చుతో నిర్మించతలపెట్టామని కేంద్ర మంత్రి వెల్లడించారు. అస్సామ్‌లోని గోల్‌పారా వద్ద గల జోగిఘోపా టర్మినల్ వద్ద సరిహద్దు గోడ నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదిత జలమార్గాల కారణంగా వాణిజ్య కార్యకలాపాలతో పాటు పర్యాటకులకు సైతం ఊతం లభించనుందన్నారు. కోస్తా ప్రాంతంలోనూ జలమార్గాలను ఆధునికీకరించే కార్యక్రమాలు చేపట్టామన్నారు.


7వ వేతన సంఘం సిఫారసులను
అమలు చేస్తాం

- పాత పెన్షన్ విధానంపై సానుకూల నిర్ణయం
- ఉద్యోగులకు సీఎం భరోసా



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడు కోట్లమంది ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వ ఉద్యోగులు వారధిగా నిలబడాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య విజ్ఞప్తి చేశారు. గ్యారెంటీ పథకాల అమలు కారణంగా ఆర్థికభారం ఉన్నా 7వ వేతన కమిషన్ తుది సిఫారసులు అందిన వెంటనే వీటిపై సానుకూలంగా స్పందిస్తామని ప్రకటించారు. బెంగళూరు ప్యాలెస్ మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల భారీ సమ్మేళనాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలసంఖ్యలో హాజరైన ఉద్యోగులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు కరువు భత్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండానే రాష్ట్రంలో ఉద్యోగులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని తొలగించి పాత విధానాన్ని కొనసాగించాలని ఉద్యోగులు చేస్తున్న డిమాండ్‌పై కూడా సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకోసం ఆరోగ్య సంజీవని పథకాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేయడం ద్వారా గ్యారెంటీ పథకాలు మరింతగా విజయవంతమయ్యేలా కృషి చేయాలని ఆయన ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 7.50లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉండగా అందులో 5.90 లక్షలమంది పనిచేస్తున్నారన్నారు. మిగిలిన ఉద్యోగాలను దశలవారీగా భర్తీ చేస్తామని అన్నారు. ప్రజాప్రభుత్వ యజమానిగా ఉన్న తనకు ఉద్యోగులు కుటుంబ సభ్యులలాంటివారని అన్నారు. వారి సమస్యలన్నింటిని తాను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నా అన్నారు. ఆరోవేతన కమిషన్ సిఫారసులలో 30 శాతం ఫిట్‌మెంట్‌ను ఆమోదించి రూ.10,500 కోట్లను గతంలో సీఎంగా ఉన్నప్పుడు విడుదల చేశానని గుర్తు చేశారు. 7వ వేతన సంఘం కూడా మధ్యంతర నివేదికలో 17 శాతం ఫిట్‌మెంట్ మంజూరు చేసిందన్నారు. అంతిమ నివేదిక కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షడాక్షరి, సంఘం కార్యదర్శి శ్రీనివాస తిమ్మేగౌడ, కోశాధికారి సిద్దరామణ్ణ తదితరులు ప్రసంగించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.02	1,605.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	934	8,090
సామర్థ్యం (టీఎంసీలు)	8.72	30.12

ఘనంగా అమరవీరుల దినోత్సవం



మాట్లాడుతున్న ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షులు ఈరన్న

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 27: స్వాతంత్ర్య పోరాటంలో రాజీలేని విప్లవ యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ లాంటి అమరవీరుల దినోత్సవాన్ని ఏఐడీఎస్‌ఓ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బళ్లారి జిల్లా అధ్యక్షుడు కే.ఈరన్న మాట్లాడుతూ 14ఏళ్ల వయస్సులో భారతదేశాన్ని బ్రిటీష్ బానిసత్వం నుంచి విముక్తి చేసేందుకు చంద్రశేఖర్ ఆజాద్ కృషి చేశారన్నారు. స్వతంత్ర భారతావని కోసం పోరాడి 24 సంవత్సరాల వయస్సులో 1931 ఫిబ్రవరి 27న అమరుడయ్యాడన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఈ యువ విప్లవకారుడి స్ఫూర్తి నేటికీ సజీవంగానే ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్లు గడిచినా మన దేశంలో నిరుద్యోగం, బాలికలపై అత్యాచారాలు అలాగే ఉన్నాయన్నారు. కావున విద్యార్థులు గొప్ప వ్యక్తుల బాటలో పాటు పడాలని, భవిష్యత్తులో సామాజిక న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ ఉపాధ్యక్షురాలు ఎం.శాంత, ఉమ, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరుగుప్పలో బీజేపీ ప్రచారం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 27 : రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని సిరుగుప్ప, బీజేపీ నగర అధ్యక్షులు విక్రమ్ కుమార్ జైన్ ప్రజలను కోరారు. సిరుగుప్ప పట్టణంలోని 25వ వార్డులో మంగళవారం ఆయనఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. నరేంద్ర మోడీ విజయాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. దేశ ప్రధాని దేశ భవిష్యత్తు కోసం ఎన్నో చేశారని తెలిపారు. ఆయనకు మద్దతిస్తే మున్ముందు దేశ భవిష్యత్తును మరింత ముందుకు తీసుకెళతారని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నగర మాజీ అధ్యక్షులు గంగాధర, ఉపాధ్యక్షులు శంకర్, వార్డు ఉపాధ్యక్షులు మల్లికార్జున, మల్లయ్య, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరస్వామి రథోత్సవం



ఇటిగిలో సాగుతున్న సంగమేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, ఫిబ్రవరి 27 : ఇటిగి గ్రామంలో పేరు గాంచిన సంగమేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వామదేవ శివాచార్యులు, హెబ్బళ మఠ నాగభూషణ శివాచార్యులు, బుక్కసాగర విశ్వారాధ్యచార్యులు పాల్గొని పూజలు చేపట్టారు. అనంతరం దేవస్థానం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు ఊరేగింపు నిర్వహించారు. ఇటిగితో పాటు మన్నూరుసూగూరు, సన్నాపురం, ముద్దాపురం, బెళగోడుహాళ్, కంప్లి తదితర గ్రామాల ప్రజలు ఈ రథోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మొన్న సీఎంతో.. నిన్న మాజీ సీఎంతో..

గాలి జనార్దనరెడ్డి రాజకీయంపై సర్వత్రాచర్చ



సోమవారం సిద్ధరామయ్యతో రాజ్యసభ ఓటింగ్‌పై చర్చలు



మంగళవారం యడ్యూరప్పకు పుట్టినరోజు శుభాకాంక్షలు

బళ్లారి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కేఆర్‌పీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి మొన్న సీఎం సిద్దరామయ్యతో, నిన్న మాజీ సీఎం యడ్యూరప్పతో కలవడం చర్చనీయాంశంగా మారింది. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిశారని ఆపార్టీ వర్గాలు భావించాయి. ఎంపీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన ఓటు అధికార పార్టీకి కావాలంటే ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన తన పనులు చేయాలని డిమాండ్ చేసి రాత్రికి రాత్రే ఫైళ్లపై సంతకాలు చేయిచుకున్నారనే చర్చలు జరుగుతున్నాయి, డీకే శివకుమార్ కూడా ఇందుకు సరే అన్నట్లు తెలుస్తోంది. మరి మరుసటి రోజు అంటే మంగళవారం మాజీ ముఖ్యమంత్రి బీజేపీ నాయకుడు యడ్యూరప్ప జన్మదిన వేడుకల సందర్భంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి హ్యాపీ బర్త్‌డే అప్పా..! అని చెప్పినట్లు సమాచారం. మొన్న సిద్దూతో నిన్న యడ్డీతో కలిసిన జనార్దన్ రెడ్డి గాలివాటం చూసి అందరూ చర్చించుకుంటున్నారు. ఈకాలంలో రాజకీయం అంటే ఇదేకదా! అంటూ అందరూ చర్చించుకుంటున్నారు.

జాతరలో భక్తులను ఆకర్షిస్తున్న గొరవయ్యలు



భవిష్యవాణి చెబుతున్న గొరవయ్య రామన్న

కంప్లి, ఫిబ్రవరి 27: విజయనగర జిల్లా హువినహడగలి తాలుకాలో ప్రసిద్ధి గాంచిన మైలార లింగేశ్వర జాతర మహోత్సవానికి లక్షలాది మంది భక్తులు వచ్చారు. అదే విధంగా ఈ జాతరలో గొరవయ్యలు పాదయాత్రగా వచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం ధర్మకర్త వెంకప్పయ్య ఒడియార్ ఆలయానికి చేరుకున్న అనంతరం గొరవయ్య రామన్న లక్షలాది మంది మధ్యన 'సంపాయితలే పరాక్' అని భవిష్యవాణి చెప్పారు. ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసు బందోబస్తు చేపట్టారు. ఉదయం శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఊరేగింపు కూడా నిర్వహించారు. పల్లకిసేవ చేపట్టారు. సుమారు 11 రోజుల పాటు గొరవయ్యలు ఉపవాసం వుండి ఈ భవిష్యవాణి చెబుతుండటంతో వేలాదిమంది భక్తులు వీరియందు ఆకర్షితులవుతున్నారు. ఈ భవిష్యవాణి ఖచ్చితంగా జరుగుతుందన్న ఉద్దేశంతో సుమారు పది లక్షలకుపైగా భక్తజనం ఈ భవిష్యవాణి కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

అనారోగ్యంతో యాదగిరి వాసి మృతి



సురేష్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 27: ఏపీలోని అనంతపురం ఆర్టీసీ బస్టాండులో మంగళవారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువకుడు సురేష్ (33) మృతి సంఘటన చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం యాదగిరికి చెందిన యువకుడు బస్టాండ్‌లో మృతిచెంది ఉండగా డిపోమేనేజర్ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడి వద్ద గల సెల్‌ఫోన్, ఆధార్, ఆధారంగా కర్ణాటక వాసిగా గుర్తించి బంధువులకు సమాచారం అందజేశారు. అతడు అనారోగ్యంతో రెండురోజుల క్రితం పుట్టపర్తికి వచ్చాడని, మృతదేహాన్ని తమ స్వగ్రామానికి తీసుకెళతామని బంధువులు తెలిపారు.

అమృతేశ్వర ఆలయంలో భక్తుల సందడి



స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం



పల్లకీ సేవ చేస్తున్న భక్తులు

శాస్త్రోక్తంగా సాగుతున్న పూజలు

బళ్లారి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బళ్లారి సమీపంలోని బాలాజీ నగర్ క్యాంపులో ఈనెల 25 నుండి 29 వరకూ అమృతేశ్వరస్వామికి జరుపుతున్న పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. పూజల్లో భాగంగా మంగళవారం రుద్ర పారాయణం, మహా మంగళారతి, ప్రసాద వినియోగం అలాగే సాయంత్రం రుద్రహోమం, మహా మంగళారతి, అష్టావధాన సేవనిర్వహించారు. కొర్రపాటి సాయి దంపతులు, కుటుంబీకులు, భక్తులు పూజలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి వివిద క్యాంపుల నుండి విశేషంగా భక్తులు హాజరయ్యారు.

రంగస్థల సంగీతం సజీవం

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 27: నేటి కొత్తతరానికి సంగీతం అనగానే గుర్తుకు వచ్చేది సినిమా సంగీతమే. అయితే జానపద, శాస్త్రీయ, రంగస్థల సంగీతం వంటి కళా ప్రక్రియలు కూడా మన మధ్య సజీవంగా ఉన్నాయని ప్రముఖ రంగస్థల కళాకారిణి ఎం.వరలక్ష్మి అన్నారు. నగరంలోని సరళాదేవి కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్, డ్రామా విభాగం ఆధ్వర్యంలో రంగసంగీతం, వర్తమాన అవకాశాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో సంగీత దిగ్గజాలైన సిరిగేరి నాగనగౌడ్, మదిరె మరిస్వామి, కంప్లి వాదిరాజా , సుభద్రమ్మ మన్సూర్, బెళగల్లు వీరన్న, ఆదోని వీణా మొదలైన వారు రంగస్థల సంగీత రంగంలో అద్వితీయమైన కృషి చేశారు. వీఎస్‌కే విశ్వవిద్యాలయ కళల అధ్యాపకుడు అన్నాజీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సంగీతంలేకుండా ఏ నాటకమూ పూర్తికాదని సంగీతం నాటకానికి జీవనకాదారం అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రంగస్థల సంగీత వారసత్వాన్ని అధ్యయనం ద్వారా తెలుసుకోవాలన్నారు.. రంగస్థలం పాటలను రికార్డు చేసేలా మనస్ఫూర్తిగా కృషి చేయాలని, అస్తవ్యస్తంగా ఉన్న నాటకరంగాన్ని కాపాడి అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాటక విభాగం అతిథి అధ్యాపకులు విష్ణు హడపాడు, నేతి రఘురాం, నాటక విభాగం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డోలు వాయిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాకారిణి వరలక్ష్మి

ఘనంగా మడివాళ మాచిదేవ జయంతి

సిరుగుప్ప, ఫిబ్రవరి 27 : ఘనంగా మడివాళ మాచిదేవ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిరుగుప్ప పట్టణంలో రజకులు మడివాళ మాచిదేవ భావచిత్రపటంతో పట్టణ ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. రేణుకాశ్రమంలో సమావేశం నిర్వహించారు. మడివాళ మాచిదేవ చరిత్ర ఎంతో వుందని రజకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాలుకా వ్యాప్తంగా వున్న రజకుల సమాజ ప్రముఖులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



పూజలందుకున్న మడివాళ మాచిదేవ

మంత్రి పుట్టినరోజుకు బస్సుల మళ్లింపు

● ఇబ్బందిపడ్డ ప్రయాణికులు, విద్యార్థులు



కంప్లి బస్సులో ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

కంప్లి, ఫిబ్రవరి 27: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ ఈ మంగళవారం విజయనగర జిల్లా హొస్పేటలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడంతో ప్రజలను తరలించేందుకు ప్రతి గ్రామానికి బస్సులు వెళ్లాయి. దీంతో భక్తులు సరియైన సమయానికి బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే బస్సుల కొరత వుండగా వున్న కొద్ది బస్సులను కూడా మంత్రి పుట్టినరోజుకు తరలించడంతో ప్రయాణికులు, ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం వచ్చిన ఒకే ఒక బస్సులో విద్యార్థులు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రాణాలకు తెగించి ప్రయాణిస్తున్నారు.

అడుగంటిన తుంగభద్ర డ్యాం

● డెడ్‌స్టోరేజ్ స్థాయికి పడిపోయిన నీటిమట్టం

● తాగునీరు అందక గొంతెండుతున్న జనం

బళ్లారి ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆంధ్రరాష్ట్రాల జీవధార అయిన తుంగభద్రమ్మ నీరు లేక పూర్తిగా ఒట్టిపోయింది. గతంలో ఏనాడు ఇలాంటి పరిస్థితి నెలకొనలేదని అధికారులు అంటున్నారు. తుంగభద్ర జలాశయం ద్వారా కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, విజయనగరం, కొప్పళ జిల్లాల తోపాటు ఆంధ్రలోని అనంతపురం, కర్నూలు జిల్లాలకు సాగు నీరు, తాగునీరు అందుతుంది. అయితే ఈ ఏడాది వర్షాభావం కారణంగా డ్యాం నిండలేదు. ఈ సంవత్సరం ఖరీఫ్‌కే నీరు సరిపోలేదు. రబీ పంటలకు అసలు నీటిని వదలలేదు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

తుంగభద్ర డ్యాం నెలకొనిఉన్న హొసపేటలో కూడా 15రోజుల కొకసారి తాగు నీరు వదులుతున్నారు. కొప్పళ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొనిఉంది. తుంగభద్రజలాశయం నుండి నీరు సరిగా అందకపోవడంతో బళ్లారిలో ఇరవై రోజులకొకసారి తాగునీరు అందిస్తున్నారు. అల్లీపురం, మోకా రిజర్వాయర్‌లలో కూడా నీరు పూర్తిగా అడుగంటి పోయింది. ప్రస్తుతం టీబీడ్యాంలో కేవలం 8.7టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 30.12టీఎంసీల నీరు ఉండేది. జలాశయంలో నీరు పూర్తిగా డెడ్‌స్టోరేజీ స్థాయికి పడిపోయింది. బ్యాక్ వాటర్ కూడా పూర్తిగా ఎండిపోయింది. దీంతో కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల ప్రజలు తాగు నీరు అందక ఇబ్బంది పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొంటే రాబోయే ఏప్రిల్, మే నెలల్లో ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నీరులేక ఎండిపోవడంతో బయటపడిన తుంగభద్ర జలాశయ అడుగుభాగం

ఆరు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 27: ముప్పై ఏళ్లు పైబడిన వారు రక్తపోటు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధుల కోసం ప్రతి ఆరు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు. ఆరోగ్య మేళా సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవనశైలి వ్యాధులకు దూరంగా ఉండేందుకు ఆరోగ్యశాఖ ద్వారా మరింత అవగాహన కల్పిస్తున్నామని ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈమేరకు సమాచారం అందిస్తామన్నారు.అదేవిధంగా స్పెషలిస్టులు, వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది తనిఖీ చేపట్టి ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవిలో నీరు ఎక్కువగా తాగాలని, కాటన్ దుస్తులను ధరించాలన్నారు. మధ్యాహ్నం ఎండలో నడవరాదన్నారు. ఆరోగ్య శిబిరాల్లో క్షయ లక్షణాలు ఉన్న వారికి కఫ పరీక్షలు నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జనారోగ్య యోజన, ముఖ్యమంత్రి ఆరోగ్య కర్ణాటక యోజన కార్డు, డిజిటల్ హెల్త్ కార్డుల పంపిణీ చేశారు. జిల్లాను ఆరోగ్యవంతంగా మార్చేందుకు ప్రజానీకం సహకరించాలని రమేశ్‌బాబు కోరారు.

హోసూరు జోన్

వేతనాల పెంపునకై నిరవధిక నిరసన



నిరసన తెలియజేస్తున్న రెవెన్యూ శాఖ అధికారులు

హోసూరు(సిఫ్‌కాట్), ఫిబ్రవరి 27: వేతనాలను పెంచాలని, ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని, దేవాదాయశాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కోరుతూ పలుమార్లు నిరసనలు చేశామని,. పది నెలల్రకితం ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలు ఆచరణలో అమలు కాలేదన్నారు. దీంతో దేవదాయశాఖ అధికారులు మంగళవారం నిరసన తెలిపారు. పలు డిమాండ్ల పరిష్కారానికై తహసీల్దార్ నుంచి ఆఫీస్ అసిస్టెంట్‌ల వరకు 125మందికిపైగా రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు ఈ నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల విధులకు కేటాయిస్తే అందుకు సంబంధించిన ప్రత్యేక గ్రాంటును ముందుగానే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శిక్షణ, పదోన్నతి, కొవిడ్ మృతులకు పరిహారం వంటి వాటికి కూడా పోరాటాలు చేయాల్సి వస్తోందని వాపోయారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

సింగిల్‌విండో అమలుపై శిక్షణ

హోసూరు(మత్తిగిరి), ఫిబ్రవరి 27: కృష్ణగిరి జిల్లాలో పట్టణాభివృద్ధి శాఖ తరపున సింగిల్ విండో సిస్టమ్ వెబ్‌సైట్ ద్వారా బిల్డింగ్ పర్మిట్ ఎలా ఇవ్వాలనే అంశంపై బాగలూరు రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం ఒకరోజు శిక్షణా శిబిరం నిర్వహించారు. హోసూరు తాలూకా తళి, కెలమంగలం, డెంకణీకోట, సర్కిల్‌ల్లోని పంచాయతీ కౌన్సిల్ నాయకులు, పంచాయతీ కార్యదర్శులకు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. కృష్ణగిరి జిల్లా పట్టణాభివృద్ధి శాఖ అధికారులు వెబ్‌సైట్ ద్వారా భవన నిర్మాణ అనుమతుల మంజూరుపై అవగాహన కల్పించారు. 100 మందికి పైగా పంచాయతీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌ను పట్టించుకోండి

హోసూరు, ఫిబ్రవరి 27: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని తమిళనాడు హౌసింగ్ బోర్డు జోన్-1లో మ్యాన్‌హోల్‌ను బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ ఎక్కువ మంది రిటైర్ట్ ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. 1996లో నిర్మించిన ఈ లే అవుట్‌లో పాత మురుగునీటి పైపులను తొలగించి నాలుగేళ్లక్రితం క్రితం కొత్త పైపులు అమర్చారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అనుబంధంగా ఉన్న ఈ మ్యాన్‌హోల్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంతో తరచూ మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. దుర్గంధం, దోమలబాధ ఉందని వెంటనే మ్యాన్‌హోల్‌ను బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నాలుగేళ్ల డిగ్రీ కోర్సు వద్దు: ఏఐడీఎస్‌ఓ



ఆందోళన చేస్తున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

రాయచూరు, ఫిబ్రవరి 27 :ఎలాంటి చర్చలు లేకుండా ప్రారంభించిన నాలుగేళ్ల డిగ్రీ కోర్సు నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు హయ్యాళప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోవిడ్ సందర్భంగా ఎవ్వరితో ఎలాంటి విద్యారంగ నిపుణులతో సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఈపీ పేరుతో డిగ్రీ కోర్సు వ్యవధిని మూడేళ్ల నుంచి నాల్గేళ్లకు పెంచిందన్నారు. కాగా ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల వ్యతిరేకతను గౌరవిస్తు నాల్గేళ్ల డిగ్రీ నిర్ణయాన్ని ఉప సంహరించుకుని గతంలో లాగా మూడేళ్ల డిగ్రీని అమలు చేస్తామని చెప్పిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామి మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఏఐడీఎస్‌ఓ విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. విద్యార్థులకు మరో రెండు నెలల్లోనే మూడేళ్ల కోర్సు పూర్తవుతున్న నేపధ్యంలో త్వరలోనే ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

మద్దతు ధర కోసం రైతుల ఆందోళన



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రైతులు

రాయచూరు, ఫిబ్రవరి 27 : పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని కోరుతూ రైతులు మంగళవారం జిల్లాధికారి కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. కర్ణాటక రైతు సంఘం, హసిరుసేనల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం నాయకులు, పంటలకు కనీస మద్దతు ధరకు సంబంధించి ప్రభుత్వం తక్షణమే చట్టం చేయాలన్నారు. కాగా డబ్ల్యూటీఓలో సభ్యత్వం నుంచి భారత దేశం బయటికి రావాలని. అబుదబిలో జరుగుతున్న ప్రస్తుతసమావేశాల్లోనే ఆ అంశాన్ని స్పష్టం చేయాలన్నారు. కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

బాబూ రాజేంద్రప్రసాద్ (వర్ధంతి)




దేశ తొలి రాష్ట్రపతిగా వ్యవహరించిన బాబూ రాజేంద్ర ప్రసాద్ 1884 డిసెంబరు 3న బీహార్ రాష్ట్రం శివాన్ జిల్లా జెర్దాయ్ గ్రామంలో జన్మించారు. 1950 నుంచి 1962 వరకు రాష్ట్రపతిగా కొనసాగారు. ఉపాధ్యాయుడిగా, న్యాయవాదిగా వ్యవహరించారు. స్వాతంత్ర్య సంగ్రామంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. కాగా రాష్ట్రపతి హోదాలో దేశ రాయబారిగా విదేశాలతో దౌత్య సంబంధాలు మెరుగ్గా ఉండేలా పలు చర్యలు చేపట్టి ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు. పార్లమెంటులో ఆయన చేపట్టిన సంస్కరణలు నేటికీ కొన సాగుతున్నాయి. ఆయన సేవలకు అత్యున్నత 'భారత రత్న' పురస్కారం అందుకున్నారు. 1963 ఫిబ్రవరి 28న కన్నుమూశారు.

రాచమల్లు రామచంద్రారెడ్డి (జయంతి)



'రారా'గా పేరొందిన రాచమల్లు రామచంద్రారెడ్డి 1922 ఫిబ్రవరి 28న కడప జిల్లా సింహాద్రి పురం మండలం పైడిపాలెం గ్రామంలో జన్మించారు. తెలుగు సాహిత్యానికి తన విమర్శతో, అనువాదాలతో, పాత్రికేయ రచనలతో వన్నె తెచ్చి బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. 'అనువాద సమస్యలు' అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. మరో గ్రంథం 'సారస్వత వివేచన'కు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. ఎన్నో గ్రంథాలను అనువదించి అనువాదకులుగా కూడా రాణించారు. 1988 నవంబరు 25న కన్నుమూశారు.

అబ్దుల్ సత్తార్ ఈది (జయంతి)



అబ్దుల్ సత్తార్ ఈది 1928 ఫిబ్రవరి 28న గుజరాత్ రాష్ట్రం బంత్వా గ్రామంలో జన్మించారు. పక్షవాతానికి గురైన తల్లికి అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని ముసలివాళ్లకు, మానసిక దివ్యాంగులకు, దివ్యాంగులకు సేవ చేసే లక్ష్యంతో ముందుకు సాగారు. 1947లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. కరాచీలో పేద ప్రజలకోసం ఒక ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఉచిత వైద్యం, ఇతర సేవలు అందించారు. అనాథాశ్రయాలు, వైద్య కళాశాలలు, మహిళా వసతి గృహాలను నిర్వహిస్తోంది. ఆయన సేవలకు లెనిన్ శాంతి బహుమతి, రామన్ మెగసెసె అవార్డు ఇతర పురస్కారాలు అందాయి. 2016 జూలై 8న కన్నుమూశారు. ప్రస్తుతం ఈది ఫౌండేషన్‌ను ఆయన కుమారుడు ఫైజల్ పర్యవేక్షిస్తున్నారు.

మాండొలిన్ శ్రీనివాస్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత మాండొలిన్ శ్రీనివాస్ 1969 ఫిబ్రవరి 28న పశ్చిమ గోదావరి జిల్లా పాల కొల్లులో జన్మించారు. అసలు పేరు ఉప్పలపు శ్రీనివాస్. మాండొలిన్ వాద్యం వాయించడంలో రాణించి మాండొలిన్ శ్రీనివాస్‌గా గుర్తింపు పొందారు. కర్ణాటక సంగీతంలో మాండొలిన్‌ను ఉపయోగించిన ప్రథమ కళాకారుడు. రాగాలు, స్వరాలకు అనుకూలంగా మాండొలిన్‌ను మలిచాడు. హిందూస్తానీ సంగీతంలోనూ రాణించారు. కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలలో సంగీత కచేరీలు నిర్వహించారు. హరిప్రసాద్ చౌరాసియా, జాకీర్ హుస్సేన్ వంటివారితో కలసి పనిచేశారు. 15ఏళ్లకే తమిళనాడు రాష్ట్ర ఆస్థాన విద్వాంసుడిగా పదవి పొందగా, సంగీత రత్న, సనాతన సంగీత పురస్కార్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2014 సెప్టెంబరు 19న కన్నుమూశారు.

సునీల్ (పుట్టినరోజు)



సునీల్‌గా పేరొందిన ఇందుకూరి సునీల్‌వర్మ 1973 ఫిబ్రవరి 28న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. తెలుగు నటుడిగా 200కుపైగా సినిమాలలో నటించారు. తొలుత హాస్య నటుడిగా నటించి తర్వాత కథానాయకుడిగా మారారు. నువ్వే కావాలి, నువ్వు నేను, నువ్వు నాకు నచ్చావ్, సొంతం, మనసంతా నువ్వే, ఆంధ్రుడు తదితర సినిమాలు హాస్య నటుడిగా గుర్తింపు తెచ్చాయి. అందాల రాముడు, మర్యాదరామన్న కథానాయకుడిగా పేరొందాయి. ఉత్తమ హాస్యనటుడిగా నంది పురస్కారం, స్పెషల్ జ్యూరీ పురస్కారం, ఫిలింఫేర్ అవార్డులు పొందారు.

కామాంధుడు ఉమేశ్‌రెడ్డికి పెరోల్ నిరాకరణ

▸▸ పిటిషన్‌ను తిరస్కరించిన హైకోర్టు ధర్మాసనం

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పలు అత్యాచారాలు, హత్యల కేసులలో నిందితుడిగా ఉండి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఉమేశ్‌రెడ్డికి పెరోల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రస్తుతం పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో ఉన్న ఉమేశ్‌రెడ్డి, అనారోగ్యంతో అలమటిస్తున్న తల్లికి సేవలందించేందుకు 30 రోజుల పెరోల్ ఇవ్వాల్సిందిగా పిటీషన్ దాఖలు చేసుకున్న సంగతి విదితమే. పిటీషన్‌ను సోమవారం విచారించిన న్యాయమూర్తి నాగప్రసన్న తీవ్ర నేరాలకు పాల్పడిన ఉమేశ్‌రెడ్డికి పెరోల్ ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. అశ్ఫాక్ కేసులో రాజస్థాన్ ప్రభుత్వం దాఖలు చేసుకున్న పిటీషన్‌పై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఉల్లేఖించింది. ఉమేశ్‌రెడ్డి వంటి తీవ్ర క్రూర మనః స్థితి ఉన్నవారికి పెరోల్ ఇస్తే తదనంతరం జరిగే నేరాలను నియంత్రించడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. 1998 ఫిబ్రవరి 28న బెంగళూరులో జరిగిన మహిళల వరుస అత్యాచారాలు, హత్యలతో ఉమేశ్‌రెడ్డికి సంబంధం ఉందని రుజువు కావడంతో హైకోర్టు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. అనంతరం సుప్రీంకోర్టును ఆశ్రయించగా దీన్ని యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. తీవ్ర నేరాలకు పాల్పడినవారు పెరోల్‌పై రావాలంటే కనీసం 30 సంవత్సరాలు కారా గారం అనుభవించి ఉండాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను ప్రస్తావించిన ధర్మాసనం ఉమేశ్‌రెడ్డికి పెరోల్ ఇచ్చేందుకు నిరాకరించింది. నేరస్థులకు పెరోల్ మంజూరులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉందన్నారు.

దార్శనిక నేత కేసీ రెడ్డి: సీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీ రెడ్డి దార్శనికులని ఆయన మార్గదర్శకంలోనే తమ ప్రభుత్వం కొనసాగుతోందని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. మైసూరు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కేసీ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేశారు. స్వాతంత్ర్య పోరాటంలో తనను తాను అర్పించుకున్నారు. కర్ణాటక ఆర్థికంగా సదృఢంగా కొనసాగేందుకు ఆయన వేసిన పునాదులే కారణమన్నారు. 1950లో రాజ్యాంగం అమలయ్యాక జరిగిన ఎన్నికల్లో కేసీ రెడ్డి తొలి ముఖ్యమంత్రి అన్నారు. కేసీ రెడ్డిని గౌరవించేలా ప్రభుత్వం కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రులు రామలింగారెడ్డి, హెచ్‌కే పాటిల్, ఎమ్మెల్యేలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.





కేసీ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి, సీఎం, మంత్రులు తదితరులు

నగలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం



నగలను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ దయానంద

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఒంటరిగా సంచరించేవారిని లక్ష్యంగా చేసుకుని కొంతమంది దాడి చేసి వారి నుంచి నగదు, నగలు, మొబైల్ ఫోన్లు చోరీకి పాల్పడుతున్నారు. ఇలా పాల్పడుతున్నవారి ఇద్దరిని మహదేవపుర పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 68 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్రదుర్గ జిల్లా హిరియూరుకు చెందిన రంగనాథ్ (33), గిరీశ్ (23)లు అరెస్టు అయినవారిగా బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ వెల్లడించారు. మంగళవారం చోరీ సొత్తును పరిశీలించి ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్ల విలువ సుమారు రూ.20లక్షలుగా ఉంటుందన్నారు. రద్దీ ప్రదేశాలైన టిన్ ఫ్యాక్టరీ, మారతహళ్ళి, హెబ్బాళ, సిల్క్‌బోర్డ్ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడేవారని, సొంత ప్రాంతం హిరియూరులో మొబైల్ ఫోన్లు అమ్మేవారన్నారు. వైట్‌ఫీల్డ్ డీసీపీ డాక్టర్ శివకుమార్ నేతృత్వంలో కార్యాచరణ చేపట్టి నిందితులను అరెస్టు చేశారన్నారు. అలాగే ఇతర స్టేషన్ల పరిధిలో చోటు చేసుకున్న నేరాలను వివరించారు. బయ్యప్పనహళ్ళి పోలీసులు సీవీరామన్ నగర్‌కు చెందిన గురుప్రసాద్‌నుంచి రూ.7.78 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు.

బెంగళూరు మేళాకు తరలిన ఉద్యోగులు



శిడ్లఘట్ట నుంచి బయల్దేరుతున్న ఉద్యోగులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 27: పలు డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బెంగళూరు పిలుపు మేరకు 98 సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బెంగళూరు ప్యాలెస్ మైదానంలో మంగళవారం ఏర్పాటైన భారీ సమ్మేళనానికి తాలూకానుంచి పెద్దసంఖ్యలో బయల్దేరారు. తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ తాలూకాలో సుమారు వెయ్యి మంది ప్రభుత్వ ఉద్యోగులు, రిటైరైన వారు బస్సులు, ఇతర వాహనాలలో బెంగళూరుకు బయల్దేరుతున్నట్టు తెలిపారు. సమావేశానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ఇతర మంత్రులు విచ్చేయనున్నారన్నారు.

చింతామణి నుంచి...

చింతామణి: చింతామణి తాలూకా నుంచి బెంగళూరు మేళాకు 13 బస్సులలో ప్రభుత్వ ఉద్యోగులు బయల్దేరారు. నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి, తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్, తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మునిరెడ్డి పచ్చజెండా చూపారు. మునిరెడ్డి మాట్లాడుతూ పలు బస్సులలో 1100మందికిపైగా ఉద్యోగులు బెంగళూరుకు వెళ్తున్నట్టు తెలిపారు. వివిధశాఖల అధికారులు సహకారం అందిస్తున్నారన్నారు.



చింతామణి నుంచి బస్సులకు పచ్చజెండా

ప్రాంతీయ భాషల వాడకంపై సదస్సు



సదస్సులో పాల్గొన్న బ్యాంకు ఉన్నతాధికారులు, అతిథులు

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. 'ప్రాంతీయ భాషల వాడకం - వినియోగదారులపై ప్రభావం' అనే అంశంపైనా హిందీ భాష వాడకంపైనా చర్చించారు. మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ టీకే వేణుగోపాల్, భాషావేత్తగా పేరొందిన యూఆర్ రావ్ ఇస్రో శాటిలైట్ బెంగళూరు విభాగం డిప్యూటీ డైరెక్టర్ శీనా రాజేంద్రన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బ్యాంకు వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు. మాతృభాష ఆవశ్యకత, వినియోగదారుల సేవలపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. శీనా రాజేంద్రన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చేరువ కావడానికి మాతృభాష, సంస్కృతులు ఎంతో దోహదపడుతుందన్నారు. జనరల్ మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారులకు చేరువ కావడానికి స్థానిక మాతృభాష వాడకం, ప్రాంతీయ భాషలను నేర్చుకోవడం ఎంతో ప్రధానమని ఇందుకు ఉద్యోగులు అంతా సహకరించాలన్నారు. సదస్సు విజయవంతం కావడంపై నగరంలో బ్యాంకు ఒక ప్రకటన విడుదల చేసింది.

2న తాలూకా కసాప సమ్మేళనం

బాగేపల్లి, ఫిబ్రవరి 27: కన్నడిగుల అక్షర జాతరలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కన్నడ సాహిత్య పరిషత్ (కసాప) తాలూకా అధ్యక్షుడు డీఎన్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మార్చి 2న శనివారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో 6వ కన్నడ కన్నడ సాహిత్య సమ్మేళనం జరగనుందని అందరూ పాల్గొని విజయవంతం చే యాలన్నారు. పట్టణంలోని డీవీజీ రోడ్డులోగల ప్రతి దుకాణానికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేళనం సమస్త కన్నడిగుల అక్షర పరంపర పండుగ కావాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. 6వ తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళనానికి కన్నడ భాష, సాహిత్యం, సంస్కృతి, కళలను ప్రతిబింబించేలా ఉండడంతోపాటు తాలూకా గొప్పదనాన్ని వివరించేలా చేపట్టదలిచామన్నారు. ప్రతి దుకాణం, కార్యాలయాలపై కన్నడ ధ్వజం ఎగురవేయాలన్నారు. కన్నడ భాష మనుగడకు అందరూ చేయూత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డు ప్రిన్సిపాల్ ఏకే నింగప్ప, స్వాభిమాన కరవే అధ్యక్షుడు బీటీ శ్రీనివాస్, సురేశ్, జీవిక సంఘం నారాయణస్వామి, రైతు సంఘం ప్రముఖులు రఘునాథరెడ్డి, స్థానిక ప్రముఖుడు అబ్దుల్ కరీంసాబ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కసాప పదాధికారులు

పూర్వ విద్యార్థుల సహకారం ప్రశంసనీయం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

బంగారపేట, ఫిబ్రవరి 27: ప్రభుత్వ కన్నడ పాఠశాలల ప్రగతికి పూర్వ విద్యార్థుల సహకారం ప్రశంసనీయమని బీఈఓ సుకన్యా అభినందించారు. తాలూకాలోని దేవగానహళ్ళి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు తమ వంతుగా తాము చదివిన పాఠశాలల అభివృద్ధికి సహకారం అందించారన్నారు. పాతబడిన భవనానికి కొత్తరూపం ఇవ్వడం ద్వారా అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. మీకు మార్గం చూపిన గురువుకు ధన్యవాదాలన్నారు. ఇప్పటికే రెండు తరగతి గదులను బాగు చేశారన్నారు. పూర్వ విద్యార్థులు, గ్రామస్థుల సహకారంతో విద్య సజావుగా సాగేవందుకు వీలవుతోందన్నారు. ఉపాధ్యాయుల చొరవ కూడా ఎంతో ఉందని, పాఠశాలకు వార్షికోత్సవం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. గ్రామానికి చెందిన ప్రముఖుడు, బెమెల్ రిటైర్డు ఉద్యోగి గోవిందప్ప మాట్లాడుతూ 38 ఏళ్లక్రితం పాఠశాల ఏర్పాటైందని ఇక్కడ చదివిన ఎంతోమంది ఉన్నత హోదాలలో రాణిస్తూ గ్రామానికి మంచి పేరు తెచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడకు మనం అందరం చేయిచేయి కలపాలన్నారు. వార్షికోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రాధమ్మ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి శ్యామమూర్తి, బీఈఓ కార్యాలయ అధికారి దేవరాజ్, గ్రామ పంచాయతీ సభ్యుడు రామేగౌడ, ప్రధానోపాధ్యాయురాలు శశికళ, టీచర్ మంజునాథ్, పూర్వ విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు.

బీఎన్ రాజశేఖర్‌కు ఉత్తమ సినీ నిర్మాత అవార్డు

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో జరుగుతున్న అనేక సంఘటనలకు సంబంధించి ఉత్తమ సందేశాలతో చక్కటి కథాంశాలతో సినిమాలు తీయడం సినీ నిర్మాతలకు ఎంతో శ్రమతో కూడిన వ్యవహారమని తెలుగు సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. దుబాయ్‌లో మంగళవారం జరిగిన అంతర్జాతీయ ఫిలింఫెస్టివల్‌లో ఉత్తమ నిర్మాత పురస్కారాన్ని తెలుగువాడైన జిగ్గిని బీఎన్ రాజశేఖర్‌కు అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా రాజశేఖర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కన్నడ సినిమా చిన్నర చంద్రకు పురస్కారం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. చిత్రం యూనిట్ మొత్తానికి ఈ విజయం దక్కుతుందన్నారు. బలిజసంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా ఆయన సేవలందిస్తున్నారు. చిన్నర చంద్ర సినిమాకు డాక్టర్ బరగూరు రామచంద్రప్ప దర్శకత్వం వహించారు.



పురస్కారంతో సినీ నిర్మాత రాజశేఖర్ తదితరులు

అపార్ట్‌మెంట్లలో మురుగునీటి శుద్ధి ప్రాజెక్టు



నీటిశుద్ధి యంత్రాలివే..

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నీటి వృథాను నివారించే దిశలో రాజధాని బెంగళూరులోని అపార్ట్‌మెంట్‌లు ఓ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయి. మురుగునీటిని శుద్ధి చేసే ప్రయత్నానికి శ్రీకారం చుట్టాయి. బోసాన్ వైట్‌వాటర్ సాంకేతిక సహకారంతో 11వ దశ నీటి సంస్కరణ ప్రాజెక్టు రాజధాని అపార్ట్‌మెంట్‌లలో విజయవంతంగా అమలవుతోంది. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్‌సిటీలోని ప్రముఖ అపార్ట్‌మెంట్‌లలో ఇప్పటికే విజయవంతంగా మురికి నీటి శుద్ధీకరణ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. అక్వా హైట్స్ అపార్ట్‌మెంట్‌లో 300 ఫ్లాట్‌లలోని 1500మంది నివాసులు ఏకంగా 40వేల లీటర్ల నీటిని సంస్కరించే ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సర్జాపురలోని ఎస్‌జేఆర్ వెరైటీలోనూ 200 ఫ్లాట్‌లలో ప్రతిరోజూ 60వేల లీటర్ల నీటిని సంస్కరిస్తున్నారు. ఈ ప్రయోగం మరింత విజయవంతమైతే నగర వ్యాప్తంగా లక్షలాది లీటర్ల మురుగునీటిని శుద్ధి చేయడం సులభం కానుందని సంస్థ సీఈఓ వికాస్ బ్రహ్మా వర్ పేర్కొన్నారు. నగరంలో మంగళవారం ఆయన ఈ ప్రాజెక్టు విజయవంతంగా అమలు జరుగుతున్న అపార్ట్‌మెంట్‌లను పరిశీలించారు. మురికి నీటిని సంస్కరించి వీటిని తోటలకు, ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చునని తద్వారా నీటి వృథాను నియంత్రించవచ్చునన్నారు.

11 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులకు శ్రీకారం

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రాజధాని బెంగళూరు నగరంలోని నాలుగు రైల్వే స్టేషన్‌లతో పాటు రాష్ట్రంలో మొత్తం 11 రైల్వేస్టేషన్‌లను పూర్తిగా ఆధునీకరించనున్నారు. విమానాశ్రయాలను తలపించేలా వీటిలో ప్రయాణీకులకోసం అత్యున్నత ప్రమాణాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. నైరుతి రైల్వేజోన్ ఉన్నతాధికారి ఒకరు నగరంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ బంగారపేట రైల్వేస్టేషన్‌ను రూ.21.5 కోట్ల ఖర్చుతోనూ, చెన్నపట్టణ రైల్వేస్టేషన్‌ను రూ.20.9 కోట్ల ఖర్చుతోనూ, దొడ్డబళ్ళాపుర రైల్వేస్టేషన్‌ను రూ.21.3 కోట్ల ఖర్చుతోనూ, మాలూరు రైల్వేస్టేషన్‌ను రూ.20.4 కోట్ల ఖర్చుతోనూ, మండ్య రైల్వేస్టేషన్‌ను రూ.20.1 కోట్ల ఖర్చుతోనూ, రామనగర రైల్వేస్టేషన్‌ను రూ.21 కోట్ల ఖర్చుతోనూ, తుమకూరు రైల్వేస్టేషన్‌ను రూ.21.1 కోట్ల ఖర్చుతోనూ ఆధునీకరించనున్నారు. కాగా రాజధాని బెంగళూరు నగరంలోని కేఆర్ పుర రైల్వేస్టేషన్‌ను రూ.21.1 కోట్ల ఖర్చుతోనూ, కెంగేరి రైల్వేస్టేషన్‌ను రూ.21 కోట్ల ఖర్చుతోనూ, మల్లేశ్వరం రైల్వేస్టేషన్‌ను రూ.20 కోట్ల ఖర్చుతోనూ, వైట్‌ఫీల్డ్ రైల్వేస్టేషన్‌ను రూ.23.3 కోట్ల ఖర్చుతోనూ ఆధునీకరించనున్నారు. వీటిలో చాలా రైల్వేస్టేషన్‌లను పూర్తిగా పడగొట్టేసి కొత్త స్టేషన్‌లను నిర్మిస్తారు. ఈ పనులన్నింటినీ రెండేళ్ల అవధిలోపు పూర్తిచేయాలన్న ఆలోచన ఉందని సదరు అధికారి వివరించారు.

పాత్రికేయుల ప్రయోజనాలను కాపాడుతా

▸▸ సీఎం మీడియా కార్యదర్శి కేవీ ప్రభాకర్ వెల్లడి



కేవీ ప్రభాకర్‌కు తలపాగాతో సన్మానం

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాత్రికేయుల ప్రయోజనాలను కాపాడేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని ముఖ్యమంత్రి మీడియా కార్యదర్శి కేవీ ప్రభాకర్ ప్రకటించారు. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (కేయూ డబ్ల్యుజే) ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం కేవీ ప్రభాకర్ అభినందనా కార్య క్రమం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే పాత్రికేయులకు ఉచిత బస్‌పాస్‌ల హామీ కార్యరూపం దాల్చే విషయంలో ప్రభాకర్ ఎంతగానో చొరవ తీసుకున్నారు. ఫలితంగా సీఎం ఇటీవలి తన బడ్జెట్‌లో ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించిన సంగతి విదితమే. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జర్నలిస్టుల సంఘం ప్రభా కర్‌ను ప్రత్యేకంగా అభినందించి సన్మానించింది. కార్యక్రమంలో సమాచార శాఖ కమీషనర్ హేమంత్ నింబాళ్కర్ తదితరులు పాల్గొన్నారు. కేయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూరు అధ్యక్షత వహించారు.

మండ్య నుంచే బరిలోకి దిగుతా

▸▸ ఎంపీ సుమలత అంబరీష్

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పోటీ చేయడం అంటూ జరిగితే మండ్య నుంచి మాత్రమేనని సిట్టింగ్ ఎంపీ, సినీనటి సుమలత అంబరీష్ స్పష్టం చేశారు. మండ్యలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళా కోటా కింద తన అభ్యర్థిత్వాన్ని బీజేపీ అధిష్ఠానం తప్పకుండా పరిశీలిస్తుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తంచేశారు. బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, జేడీఎస్ నేతలపై తనకు ఎలాంటి ద్వేషం లేదన్నారు. అవసరమైతే జేడీఎస్ అగ్రనేతలను భేటీ అయ్యేందుకు సిద్ధమన్నారు. శాసనసభ ఎన్నికల్లో తాను మేలుకోటె సర్వోదయ పార్టీ అభ్యర్థి దర్శన్ పుట్టణ్ణయ్యను బలపరిచానని, ఆయన మద్దతు తనకే ఉంటుందని సుమలత ఆశాభావం వ్యక్తం చేశారు. మండ్య నుంచి తాను పోటీచేయడం ఖాయమని ఆమె తెగేసి చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సుమలత ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందిన సంగతి విదితమే.

బీజేపీ టిక్కెట్ నాకే : రమేష్ జిగజిణగి

విజయపుర బీజేపీ టిక్కెట్ తనకే లభించడం గ్యారెంటీ అని సిట్టింగ్ ఎంపీ రమేష్ జిగజిణగి పేర్కొన్నారు. విజయపురలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధిష్ఠానం పెద్దల నుంచి తనకు ఈ మేరకు సంకేతాలు అందాయన్నారు. తనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని పట్టించుకోబోనని పేర్కొన్నారు. తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు. తనకు అన్ని పార్టీల్లోనూ శ్రేయోభిలాషులున్నారని చెప్పారు. పార్లమెంటులో ఒక్క ప్రశ్న కూడా అడగలేదన్న అంశంపై వివరణ ఇస్తూ నేరుగా ప్రధానికి, కేంద్రమంత్రులకు లేఖలు రాసి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయించుకున్నానని, ప్రశ్నలు అడిగి ప్రచారం పొందడం తనకు ఇష్టం ఉండదన్నారు.

పోటీ చేయను.. సిఫారసు చేయను : శ్రీనివాస ప్రసాద్

లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి పోటీ చేసే ఆలోచన లేదని అధిష్ఠానం పెద్దలకు స్పష్టంగా చెప్పేశానని చామరాజనగర బీజేపీ సిట్టింగ్ ఎంపీ వీ శ్రీనివాస ప్రసాద్ ప్రకటించారు. చామరాజనగరలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఈ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు తన అల్లుడితో సహా ఎవరి పేర్లను అధిష్ఠానం పెద్దలకు సిఫారసు చేయడం లేదన్నారు. టిక్కెట్ విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానన్నారు.

రేపు బీబీఎంపీ బడ్జెట్

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సిలికాన్ సిటీ బెంగళూరుకు బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) 2024-25 వార్షిక బడ్జెట్‌కు ముహూర్తం కుదిరింది. ఈనెల 29న బడ్జెట్ సమర్పించనున్నట్టు బీబీఎంపీ ఆర్థిక విభాగం ప్రత్యేక కమిషనర్ శివానంద్ కలకేరి బడ్జెట్ సమర్పించనున్నట్టు తెలిపారు. ఈసారి 12 - 13వేల రూపాయల కోట్ల గాత్రం ఉంటుందన్నారు. 2023-24లో రూ.11,157 కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించగా రాష్ట్ర ప్రభుత్వం దీన్ని రూ.11,885 కోట్లకు పెంచింది. ఈ ఏడాది మరింత ఆదాయం పెంచుకునే లక్ష్యంగా రూ.12-13వేల కోట్లతో బడ్జెట్ సమర్పించనున్నారు. బీబీఎంపీకి పాలకవర్గం లేక మూడున్నర సంవత్సరాలు గడిచింది. ఇంతవరకు ఎన్నికలు నిర్వహించలేదు. ఈసారి కూడా అధికారులే బడ్జెట్‌ను సమర్పించనున్నారు. కాగా లోక్‌సభ ఎన్నికలు ఏ క్షణంలోనైనా ప్రకటించే అవకాశం ఉండడంతో కోడ్ అమలులోకి రాకముందే బడ్జెట్ సమర్పించేందుకు అధికారులు సిద్ధమైనట్టు తెలుస్తోంది.

పాత్రికేయులపై దాడులు గర్హనీయం



నల్లబ్యాడ్జీతో నిరసన

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్‌లో నిజాలను నిర్భయంగా వెలికి తీస్తున్న పాత్రికేయులపై అరాచక శక్తులు తెగబడి దాడులకు పాల్పడటం తీవ్ర ఖండనీయమని కర్ణాటక తెలుగు ప్రజా సమితి పేర్కొంది. సమితి అధ్యక్షుడు డా.బొందు రామస్వామి కల్యాణనగర్‌లోని సమితి కార్యాలయంలో చేతికి నల్లరిబ్బన్ కట్టుకుని అంబేద్కర్ చిత్రపటం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వాస్తవాలను వెలుగులోకి తెస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్న ఈనాడు కార్యాలయంపై, ఈనాడు విలేఖరి, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టుపై జరిగిన దాడులను సభ్య సమాజం సహించబోదన్నారు. ఇందుకు అధికారంలో ఉన్న పాలకులు తగిన మూల్యం చెల్లించుకోకతప్పద ని హెచ్చరించారు. ఈ దాడులకు పాల్పడ్డ సంఘవ్యతిరేక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పత్రికా ప్రతినిధులపై దాడులు చేయడమంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాల్గో బలమైన రంగమైన పత్రికా స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే శాసనసభ ఎన్నికల నాటికి ఇంకెలా ఉంటుందోనని తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎస్ఐఆర్‌సీ చైర్‌పర్సన్‌గా గీతా



చైర్‌పర్సన్‌కు సీఏల అభినందనలు

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఆర్‌సీ ఆఫ్ ఐసీఏఐ) చైర్‌పర్సన్‌గా గీతా ఏబీ ఎంపికయ్యారు. 1953లో శివబోగం ఈ హోదాలో కొనసాగారు. మళ్లీ ఆరు దశాబ్దాల తర్వాత ఈ హోదాను గీతా అందుకున్నారు. కర్ణాటక రాష్ట్ర చార్టెర్డ్ అకౌంటెంట్స్ అసోసియేషన్‌కు తొలి చైర్‌పర్సన్‌గా వ్యవహరించడమే కాక కోశాధికారిగా, కార్యదర్శిగా, వైస్ చైర్మన్‌గా, ఐసీఏఐ బెంగళూరు శాఖ చైర్‌పర్సన్‌గా కొనసాగిన గీతా ప్రస్తుతం ఎస్ఐఆర్‌సీ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు పలువురు చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆమెను నగరంలో ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఐఆర్‌సీ కేంద్ర కార్యాలయం చెన్నైలో ఉండగా వీటి పరిధిలో తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి ఉన్నాయి.